నలుగురు కలసి నవ్వే వేళ!

కోణార్క్ ఎక్స్‌ప్రెస్ హుందాగా, అందంగా కోణార్క్ శిల్పాన్ని నేనే సుమా అన్నట్లు రైలు పట్టాలపై నిలుచుని ఉంది. సికింద్రాబాద్ ప్లాట్‌ఫారమ్ పెళ్ళి పందిరిలా ఉంది. ప్రయాణికులు అందరూ హడావిడిగా, కోలాహలంగా గోల చేస్తూ తిరుగుతున్నారు. ఠీవిగా నిలుచున్న కోణార్క్ ఎక్స్‌ప్రెస్ లోనికి చారుమతి, రాజేష్‌లతో పాటు మరో నలుగురు అమ్మాయిలు ఎక్కారు. వారు ఎక్కుపెట్టిన విల్లుల్లా, భవిష్యత్తులో కూడా లోకంలోని ఆనందమంతా తాగేస్తాం అన్నట్లు అందర్నీ తప్పించుకుని దూసుకుపోతున్నారు. వారు అప్సరసలు కాదు, కాని అందగత్తెలే. చూసే కొద్దీ చూడాలనిపించేవారే. చారుమతి, రాజేష్‌లు నవ దంపతులు. కూర్చున్న తరువాత "ట్రయిన్ ఎప్పుడూ ప్లాట్‌ఫారమ్ మీద నిలబడి ఉంటుంది ఎందుకు?" అపర్ణ అడిగింది. అందులో అందరికంటే ఎక్కువ అందమైనది, సరదా అయినది ప్రత్యేకంగా సుస్మిత ఒక్కతే. మిగిలిన వారికందరికీ జోక్స్ వెయ్యడం కంటె నవ్వడం బాగా వచ్చు.

"ఆఁ ఏం లేదు. దానికి కూర్చోవడం చేతకాక." సుస్మిత అంది. అందరూ నవ్వారు. "ఇదేదో సినిమాలో జోక్ లాగుందే" రమ్య అంది. "సినిమాలోదైనా, మరేదైనా సమయానుకూలంగా జోక్ చెప్పడం కూడా ఒక కళ" అపర్ణ అంది.

"ఏమిటి కళల మీద కవిత్వం చెబుతున్నారు?" నిరీక్షణ అంది.

"లేకపోతే నీమీద చెప్పమంటావా? నిరీక్షణ అమావాస్య నిశీధిలా తెల్లగా ఉంది." స్మిత మాటలకు నిరీక్షణ ఉడుక్కుంది.

వారు అయిదుగురూ ఆడ పంచపాండవులలాగ ఉండేవారు విశాఖపట్నంలో కాలేజీలో. అందులో నిరీక్షణ, అపర్ణ, రమ్యలకు ముందుగా పెళ్ళిళ్ళు అయిపోయాయి. వారందరూ సుస్మిత పెళ్ళిలోనే ఆఖరుసారి కలుసుకున్నారు. ఇప్పుడు మరలా చారుమతి పెళ్ళిలోనే కలవడం. సుస్మిత పెళ్ళి అయిన తరువాత ఆమె కాపురం సంగతులు వారికి తెలియవు. తెలుసుకోవాలనే ఆరాటం అందరిలోనూ ఉంది. అంతకు ముందు రోజే చారుమతికి పెళ్ళి అయింది. చారుమతి వాళ్ళ అమ్మమ్మ ఊరిలో పెళ్ళి చేయాలని పట్టుబట్టడంతో పెళ్ళి హైదరాబాదులో జరిగింది. పెళ్ళి కాగానే అందరూ విశాఖపట్నం బయలుదేరారు. అందరూ డిగ్రీచేశారు. పెళ్ళిళ్ళు చేసుకున్నారు.

రన్నింగ్ రేస్‌కి బయలుదేరుతున్నట్టు ట్రెయిన్ కదిలింది. ట్రయిన్‌లో ఉన్నవారి సుఖదుఃఖాలతో ప్రమేయం లేకుండా అది సాగిపోతుంది. అందులో ఎవరు ఎలాంటివారైనా అందరినీ ఒకేవిధంగా వారి వారి గమ్యాలకు, తారతమ్యాలు చూపకుండా చేర్చాలని దాని తాపత్రయం. పెళ్ళి కొడుకు రాజేష్ ఏమనుకున్నాడో వారి దగ్గరినుండి వెళ్ళిపోయి మరోచోట పెళ్ళి బంధువుల దగ్గర కూర్చున్నాడు.

"ఏమిటో. చారుమతి! మీ ఆయన అలిగాడా ఏమిటి? దూరంగా కూర్చున్నాడు" చారుమతి సిగ్గుపడింది అందంగా. విరిసీ విరియని పువ్వు ఆకుల మధ్య దాగినట్టు మొహం క్రిందకు వుంచుకుంది భర్తను గుర్తు చేయగానే. వారి అయిదుగురి పుట్టిళ్ళు విశాఖపట్నమే. అత్తారిళ్ళు మాత్రం వేర్వేరు ఊర్లు.

'ఆఁ అలిగాడు. అలకపాన్పు మీద ట్రెయిన్ కొనిమ్మని అడిగాడట. మామగారు ట్రెయిన్ కొనివ్వలేదని, ఇంకెప్పుడూ ట్రెయిన్‌లో మీ అమ్మాయి పక్కన కూర్చోను అని అలిగాడట." స్మిత మాటలకు అందరూ నవ్వారు. పువ్వులు విరిసినట్టు.

"ఇదేం కోరిక! చిన్నపిల్లాడిలాగ. పోనీ ఆడుకుంటానంటే లియో టాయిస్ ఉన్నాయిగా!" రమ్య అంది.

"అబ్బే! వాళ్ళింట్లో జనాభా చాలామంది ఉన్నారట. ఎంబాసిడర్‌లో అయితే సరిపోరట పాపం!" రమ్య అంది.

"ఎంబాసిడర్ సరిపోకపోతే ఏ లారీయో అడగాలిగాని ట్రెయిన్ ఏమిటి?"

"లారీలో కూడా సరిపోరట పాపం, వారి చుట్టాలు!" స్మిత అంది. వారు మాట్లాడుకుంటుంటే, నవ్వుకుంటుంటే చుట్టపక్కలవారు వింతగా చూసినా ఆ అమ్మాయిలు ఎవరినీ కేర్ చెయ్యడం లేదు. మేము టికెట్ కొనుక్కున్నాము కాబట్టి

మాకు మాట్లాడుకోవడానికి, నవ్వుకోడానికి సర్వ హక్కులూ ఉన్నాయి అన్నట్టు ప్రవర్తిస్తున్నారు.

"ఏయ్, స్మితా! అలకపాన్పు మీద మీ వారు ఏమి కోరారు?" రమ్య అడిగింది.

"నా ప్రాణాలు" నవ్వుతూ అంది.

"ఏం మీ ఆయన యమధర్మరాజా! ప్రాణాలు ఎందుకు? జోక్ చెయ్యక సరిగా చెప్పు."

"పోనీ నిజం చెప్పనా? నా నవ్వులు!"

"నవ్వులా ఏం చేసుకుంటాడట? పువ్వులు గుచ్చి నీ మెడలో వెయ్యడానికా?"

"కాదు తీసుకెళ్ళి సముద్రంలో పారేయడానికి" స్మిత అంది.

"మీకు సముద్రం దగ్గర లేదుగా! పాపం ప్రయాణం ఖర్చులు దండుగ." అపర్ణ.

"మీ వారికి హాస్యం, లాస్యం ఇష్టమేనా?" నిరీక్షణ అడిగింది.

"హాస్యం, లాస్యం నాకెంత ప్రాణమో. ఆయనకు అవి చంద్రుడు, సూర్యుడూలాంటివి. అవి అందవు ఆయనకు. నోరుంది నమలడానికి గాని, నవ్వడానికి కాదు అంటారు."

"మీ ఆయన పేరు అశోక్ కదా! అందులో 'అ' తీసేసి శోకబ్రహ్మ అని బిరుదు ఇచ్చేయి. పద్మశ్రీ కూడా ఇవ్వచ్చేమో శోకబ్రహ్మలకు" రమ్య.

"పద్మశ్రీ ఎందుకు? జయశ్రీ ఉందిగా!" నవ్వింది స్మిత.

"నీవు పెళ్ళయినా కథలు అల్లడం, చెప్పడం మానలేదన్నమాట" నిరీక్షణ.

"అమ్మో! మానేస్తే ఎలాగ? అవి నా ప్రాణం."

"మీ అత్తగారు నీపెళ్ళికి కట్నం తీసుకోలేదుగా! బాగా చూస్తారా?"

"అవును. ఆవిడ చాలా మంచివారు. కట్నం వద్దన్నారు. ఆస్తిహక్కు కావాలన్నారు"

"ఆస్తి అడిగారా?" ఆశ్చర్యంగా అడిగింది అపర్ణ.

"ఏం అంత ఆశ్చర్యపోతావు? ఆవిడ ఏమీ వేరే గ్రహంమీద నుండిగాని, వేరే దేశం నుండిగాని రాలేదు. ఆవిడ పదహారణాల భారతీయ అత్తగారు. సారీ పదహారణాలు కదా, అణాలు ఇప్పుడు లేవుగా! పదహారు పైసలు!" స్మిత చెప్పే తీరుకి నవ్వకుండా ఉండలేకపోయారు అందరూ.

"ఛ! అత్తగార్లను గుర్తు చెయ్యకే! నాకు కిరోసిన్ జ్ఞాపకం వస్తుంది." రమ్య అంది.

"మా అత్తగారు అంత పాతకాలం ఆవిడ కాదు, కిరోసిన్ వాడడానికి?"

"మరేం వాడతారు"

"ఏ గేస్ స్టౌ అయినా, స్లీపింగ్ పిల్స్ అయినా వాడతారు."

"ఛ! మరీ అన్యాయంగా మాట్లాడుతున్నావు!" నిరీక్షణ అంది.

"న్యాయంగా మాట్లాడాలి అంటే అబద్ధం ఆడాలి. నాకు ఆడపిల్లని కనడం ఇష్టం లేదు."

"ఆడపిల్ల అంటున్నావు. ఏమైనా విశేషం ఉందా? కంగ్రాచ్యులేషన్స్!" అపర్ణ.

"విశేషం లేదుగాని. విషం ఉండే ఉంటుంది మా ఇంట్లో!" స్మిత.

"ఎవరికీ విశేషాలు లేకపోతే అందరం ప్రస్తుతం ఫ్యామిలీ ఫ్లానింగ్‌ని ఫాలో అవుతున్నా మన్నమాట. బాబోయ్ మన భారత దేశం బాగుపడిపోతుంది. నేనేం చెయ్యాల్రోయ్! నేను భరించలేనురోయ్!" నాటకీయంగా అంది రమ్య.

"ఫామిలీ ప్లానింగ్ వాళ్ళమో, భర్తలను ఫాలోయింగ్ వాళ్ళమోగాని మన పెళ్ళిళ్ళు అయిపోయాయి. ఈసారి మనం కలిసేది బారసాలకే" నిరీక్షణ అంది.

ఇంతలో చారుమతి మొహం వికారంగా పెట్టేసింది.

"ఏం అలా వున్నావు!" అపర్ణ అడిగింది.

"వాంతొచ్చేలా ఉంది. నాకు ఈ ట్రెయిన్‌లు, బస్సులు పడవు."

"అప్పుడే వాంతొస్తుందా? నిన్నేగా పెళ్ళయింది. మరీ ఇంత ప్రొగ్రెస్సా!" స్మిత అంది.

"ఛీ పోవే! నాకు కడుపులో తిప్పుతుంటే నీ గోల నీది." చారుమతి అంది.

రమ్య హేండ్‌బేగ్‌లోంచి ఏలక్కాయ తీసిచ్చింది. నోట్లో వేసుకోమని.

రమ్య అంది. "తరువాత తరువాత ఇలా అందరం ఒంటరిగా కలుసుకోవడానికి కుదరదు. మొగుళ్ళను అయితే బుట్టలో పెట్టి, అందరం ఒక్కొక్కళ్ళమే వచ్చాము. పిల్లలు పుడితే వారిని చంకలో వేసుకుని రాకతప్పదు."

"పెళ్ళయితే స్వేచ్ఛ పోయిందని అనుకున్నాంగాని, మన భర్తలు మంచివారే!" అపర్ణ.

"ఒక జోక్ చెప్పనా" అని స్మిత అంది.

"చెప్పు." అందరూ ఒకేసారి అన్నారు.

"మాపక్కింటి వాళ్ళు తమిళియన్స్. ఆవిడకు తెలుగు సరిగా రాదు. మీ హజ్‌బెండ్ ఆఫీసునుండి వచ్చారా అనడానికి 'మన హజ్‌బెండ్ ఆఫీసునుండి వచ్చారా? అంటుంది.."

అందరూ తెరలు తెరలుగా ఫక్కున నవ్వారు. సముద్రపు అలలు సంతోషంతో ఎగసి పడుతున్నట్లుంది వారు నవ్వుతోంటే. ఇప్పుడు ట్రయిన్‌లోని చుట్టూ ఉన్నవారు వారి అల్లరికి అలవాటు పడిపోయారు. వింతగా చూడడం లేదు. వీలుంటే ఒక చెవి వీరివైపు పడేస్తున్నారు.

అలా నవ్వుతూంటే చారుమతికి పొలమారింది. అది చూసి రాజేష్ హడావిడిగా వచ్చాడు. అతని కంగారు చూసి మరింత నవ్వారు.

"కొత్త పెళ్ళి కొడుకు కదా! కంగారెక్కువ. కొత్త భార్యను, కొత్త కారును చాలా అపురూపంగా చూసుకోవాలి అని ఎక్కడో చదివినట్లున్నాడు." స్మిత అంది.

చారుమతి చిరుకోపం ప్రదర్శించింది. "మీరు మరీ ఘోరంగా మాట్లాడుతున్నారు." అంది.

"అవి భర్త లక్షణాలు" అపర్ణ అంది.

"మగవాడు భర్త లక్షణాలు సంపాదించడానికి చాలా వ్యవధి పడుతుందట. కాని స్త్రీ భార్య హోదా పొందడం మహాతేలికట." స్మిత అంది.

"నీ సొంత వాక్యమేనా?" నిరీక్షణ.

సొంత వాక్యమైతే ఆ 'ట'లు ఎందుకు ఉపయోగిస్తాను అని - "అసలు ఆడవారికి తృప్తి అనేది తక్కువ. ఆడవారు పెళ్ళి కాకముందు, పెళ్ళి అయ్యి భర్త వస్తే చాలనుకుంటారు. తీరా పెళ్ళయిన తరువాత భర్తను తప్పించి అన్నీ కోరుకుంటారు."

"అది నీ జీవితానుభవమా?" రమ్య అడిగింది.

"నీది కాదు, నాదీ కాదు, మన ఆడవారి జీవితానుభవం!" అపర్ణ.

"వార్ధక్యం, వివాహం అందరూ కోరతారట. తీరా వచ్చిన తరువాత విచారిస్తారట. మా వారు అంటారు ఎప్పుడూ!" రమ్య అంది.

"అయితే మీ ఆయన పెళ్ళి చేసుకున్నందుకు విచారిస్తున్నారన్న మాట." స్మిత అంది.

"మరి ఆయన స్వాతంత్రాన్ని రమ్య ఎప్పుడో హస్తగతం చేసేసుకుందిగా!" అపర్ణ అంది.

"నేను మాత్రం వార్ధక్యాన్ని కోరుకోను." స్మిత అంది స్థిరంగా.

"ఏం, ఇలాగే ఉండిపోతావా?" రమ్య ప్రశ్నించింది.

"తప్పకుండా. మీరందరూ ముసలి వాళ్ళయినా నేను మాత్రం కాను. చూస్తూ ఉండండి."

"ఏం? మీ వారు ఏమైనా అమృతం పోశారా?"

"ఆఁ! పోశారు. అమృతంలాంటి విషం. ఎంత బాగుందో, కాడ్‌బరీలాగ" నోరు చప్పరించింది.

"మీ వారు నిన్ను ఎలా చూస్తారు?" అపర్ణ అడిగింది.

"ఎలా చూస్తారు? అందరిలాగే కళ్ళతో చూస్తారు. కాళ్ళతో తన్నుతారు. బెల్టుతో కొడతారు. గరిటతో కాలుస్తారు." పకాపకా నవ్వింది.

"అందరిలాగే అంటున్నావు. మా వారు అలా చెయ్యరు." నిరీక్షణ అంది.

"అయితే మీ వారు మగవారే అన్నమాట. మనిషే అన్నమాట!"

"మీ ఆయన నలుగురిలోనూ కలుస్తారా?" రమ్య అడిగింది.

"ఊహూఁ!, ఆయనకు ఒంటరితనం అంటే ఇష్టం. ఆఖరికి పడగ్గదిలో కూడా!"

"ఒంటరితనమా?" ఆమె హేళనగా, సరదాగా చెబుతున్న జవాబులు ఇంటరెస్టుగా వింటూ ప్రశ్నించారు అందరూ ఒకేసారి.

"అవును. పెళ్ళవగానే పాత పద్ధతులు మార్చుకొని పెళ్ళాం కొంగుకి ముడిపడకూడదనేది ఆయన వాదన" అందరూ నవ్వారు, స్మిత అన్నమాట తీరుకి. స్మిత మాత్రం కిటికీలోనుండి చూస్తూ ఉండిపోయింది సాగే చెట్లవైపు. నిజానికి సాగేవి చెట్లు కాదు. ట్రయిన్ మాత్రమే. కాని ట్రయిన్ పరుగుపెడుతూ చెట్లు పరుగుపెడుతున్న భ్రమ కలిగిస్తుంది. జీవితం కూడా ఒక భ్రమేనేమో!

"మరి మీ అత్తగారు ఏమంటారు?"

"ఏమంటారు? 'ఏమే దౌర్భాగ్యపుదానా! మీ అన్నయ్యను అడిగి ఇంకా ఆస్తి పట్టుకురా' అని పట్టుకుని మరీ పట్టుబడతారు. ఆవిడ మా ఆయనలా కాదు. చేత్తో కొడతారు. ఎందుకంటే ఆవిడ' పాంటు వేసుకోరుగా? నడుముకి బెల్టు లేదుగా?"

"చాల్లే, స్మితా! మీ అత్తగారిని రాక్షసిలా చిత్రిస్తున్నావు"

"మీ అన్నయ్య నీకు ఏమీ ఆస్తి ఇవ్వలేదా?"

"ఒక ఇల్లు ఇచ్చాడు. తనొక ఇల్లు పెట్టుకున్నాడు. ఇస్తూ ఇస్తూ మరలా పుట్టింటి గుమ్మం తొక్కద్దు అని లక్ష్మణరేఖ గీశాడు. తాను రామాయణ కాలంనాడు పుట్టాననుకుంటాడు. అందుకే నేను ఇంక పుట్టింటికి వెళ్ళకూడదు."

"మీ వదిన ఏమనలేదా?"

"ఎదుటి వారిని ఏడిపించడంలో మాత్రం అన్నయ్యను ఎప్పుడూ అనుసరిస్తుంది."

ఇంతలో ట్రెయిన్ ఆగింది. రాజేష్ వచ్చి అందరికీ టిఫిన్ తెచ్చి ఇచ్చాడు. అందరూ వద్దు వద్దు అంటూనే అందుకున్నారు. అందరూ తిన్నారు.

"అసలేమీ బాగాలేవు. కాఫీకూడా చండాలంగా ఉంది. ఎలా చేస్తారో ఏమో?" రమ్య అంది.

"మంచినీళ్ళు మాత్రం బావున్నాయి. ఎవరు వండారోగాని" స్మిత మాటలకు మరొక్కసారి అందరూ ఫక్కున నవ్వారు. మంచినీళ్ళు ఆ కుదుపుకి అపర్ణ చీరమీద పడ్డాయి.

"అబ్బ! నీ మాటలకు నాచీర పాడైంది."

"పాడైనా ఫరవాలేదులే. ఇప్పుడు నీకేం పెళ్ళి చూపులు కాదు ఇక్కడ."

"అయితే పెళ్ళి చూపులకు మాత్రమే మంచిగా ఉండాలా."

"ఆడది ఎక్కడ ఎలా ఉన్నా పెళ్ళి చూపుల్లో మాత్రం లక్షణంగా కనబడాలి. లక్షల కట్నం ఇవ్వాలి."

"ఆస్తి హక్కు వచ్చిందిగా! లక్షలు కట్నం రోజులు పోతాయి."

"నిజమే! ఉరి పోసుకోవడానికి చేంతాడు బదులు ప్లాస్టిక్ తాడు" స్మిత అంది.

తరాలు మారుతున్నాయి. తరాలతోపాటు స్త్రీ సమస్యలూ మారుతున్నాయి గాని, సమస్యలు మాత్రం పోవడం లేదు. అప్పటికి, ఇప్పటికి, ఎప్పటికి మగవాడు హాయిగానే ఉన్నాడు.

"మీ అన్నయ్య ఇచ్చిన ఇంట్లోకి మారిపోయారా?" అపర్ణ అడిగింది.

"అది అమ్మేశాముగా?" స్మిత అంది.

"అమ్మేశారా?" ఆశ్చర్యంగా అడిగారు అందరూ.

"అమ్మేశారా కాదు, కొనేశారా కాదు, ఏ సారా అయినా మా ఆయనకు మంచినీళ్ళప్రాయం. మరోచోట ఇల్లు కొని జయశ్రీని అందులో పెట్టారు. అలా చేసినందుకు ఎవ్వరైనా పద్మశ్రీ ఇస్తారా అని గుమ్మంలోనే కూర్చుని ఎదురుచూస్తున్నాను."

"నీ ఆస్తి మరొకరికా? జోక్ చెయ్యకు."

"మన ఆడవారి జీవితమే మరొకరిది. ఇంక ఆస్తి ఎందుకు మనకు? అసలు బ్రహ్మదేవుడు ఆడవారిని అమీబాల్లాగ సృష్టించి, అసలు కళ్ళు, ముక్కు, చెవులు, నోరు, మాటలు ఎందుకిచ్చాడో! మెదడు లేకుండా చేసేస్తే ఆలోచనలూ, ఆవేదనలూ

ఉండవుకదా! ఆడది ఒక ద్రవ పదార్థం మగవాడి దృష్టిలో. ఎందులో వేస్తే ఆ రూపాన్నే సంతరించుకోవాలి గాని, సొంత రూపాలు, సొంత ఆలోచనలు ఉండకూడదు. ఆడది ఆడేదిగా ఉండాలంటాడు మగవాడు. తాను బాట్ అట, ఆడది బాల్ అట. బాట్ ఎప్పుడూ బాల్‌ని తన్నుతూనే ఉంటుంది."

"గొప్పగా ఇచ్చావే స్పీచ్! అబ్బా స్టేజ్ లేదుగాని అదిరిపోయిందనుకో!" రమ్య అంది.

"ఇంకా ఇస్తానే! అసలు జీవితం అంటే యౌవనం, వార్ధక్యం, పెళ్ళి, పిల్లలు, సుఖం, దుఃఖం అంటారుగాని - అందులో చావుని కూడా చేర్చాలి. చనిపోయిన వాడే ఏ ఆలోచనలూ లేక స్థిరంగా ఉండగలడు. బ్రతికున్నంత కాలం బాధలు తప్పవు."

"పెళ్ళయిన తరువాత వేదాంతం నేర్చుకున్నావా?"

"అవును. మరి మనకు కాలేజీలో నేర్పలేదుగా! నాజీవితమే నేర్పింది." పకపకా నవ్వింది స్మిత - ముత్యాలు గిన్నెలో వేసి గలగలలాడించినట్టు. అసలు ఆడదాని అందంలోనే అన్నిరకాల ఆభరణాలు ఉన్నాయి. ఇంకా ఆడదానికి ఆభరణాలెందుకో? ఆడదాని మంచి మనసు బంగారం, నవ్వులు ముత్యాలు, చూపులు పగడాలు, ప్రేమ వజ్రం అంతటి విలువైనది.

"స్మిత చాలా చిక్కింది కదూ!" రమ్య అంది.

"అవును. మాఅత్తింటి వారి చేతిలో చిక్కాను." నవ్వింది స్మిత.

"డైటింగా!" సన్నగా ఉన్నా, వారందరిలోనూ స్మిత అందం కొట్టొచ్చినట్టు కనబడుతోంది అందరికీ. చక్కనమ్మ చిక్కినా అందమేనట.

"కాదు, మా ఆడపడుచు మెడిసిన్ చేస్తోంది. ఎనాటమీకి శవాలు కావాలట. అమ్మా! మనింట్లోనుంచి వదిన్ని ఇచ్చేద్దామే అంది."

"ఆమెను మెడిసిన్ చదివిస్తున్నది మనుషులను చంపడానికా?"

"మా అత్తగారు మెడిసిన్ చదవకుండానే చంపగలరు."

"నీ ఆస్తి అమ్మడానికి ఎందుకు ఒప్పుకున్నావు?" నిరీక్షణ అడిగింది.

"నన్ను నొప్పించకుండానే నాతో సంతకం చేయించారు. మా వారు జాగ్రత్తగా నా చేయి పట్టుకుని నా చేతికి నొప్పి తగలకుండా సంతకం దగ్గర ఉండి చేయించారు. ఎంత మంచివారో చూడు." మరోసారి నవ్వింది స్మిత.

స్మిత ఎప్పుడూ అందర్నీ నవ్విస్తూ, తను నవ్వుతూ ఉంటుంది. అందరినీ ఒకే ఒక్కసారి ఏడ్పించింది. హైస్కూలులో పుత్తడి బొమ్మ పూర్ణమ్మ నాటకం వేసినప్పుడు.

"నలుగురు కలిసి నవ్వే వేళ నాపేరొకటి తలవండి" అంటూ పూర్ణమ్మ పాత్రలో లీనమై ఎంతో బాగా ఏక్ట్ చేసి అందరినీ ఏడ్పించింది.

"మరి మీ అత్తగారు ఇల్లు అమ్మవద్దు. సంతకం పెట్టవద్దు అనలేదా?"

"పాపం ఆవిడా మంచావిడే! సంతకం పెట్టేటప్పుడు నేనెక్కడ గింజుకుంటానో అని నోట్లో గుడ్డలు కుక్కి, కాళ్ళు కట్టేశారు అంతే! ఇంకా నయం. మంచావిడ కాబట్టి వదిలేశారు. మరొకరైతే నోటితోపాటు ముక్కులో దూదికూడా పెట్టి మూసేసేవారే!"

"నీకు చిన్నప్పటినుండి కథలు అల్లి చెప్పడం అలవాటేగా. ఈ కథ ఏ పత్రికలోది?" రమ్య అడిగింది.

"నిజమే! ఆ అలవాటు మానుకోలేకపోతున్నాను"

"మా దగ్గర చెబితే చెప్పావు. మీ ఆయన దగ్గర చెప్పకేం?" అపర్ణ అంది.

"చెప్పను. అసలు ఆయనతో మాట్లాడాలంటే ముందే జయశ్రీ దగ్గర అపాయింట్‌మెంట్ తీసుకోవాలి. ఇంక కథలు చెప్పడానికి అవకాశం ఏది?"

"ఏం మీ ఆయన అంత బిజీనా?"

"ఊహూఁ బిజీకాదు, మాజీ ప్రియురాలి దగ్గర ఉంటారు కదా!"

"మీ మరిది ఏం చేస్తున్నాడు? ఉద్యోగం దొరికిందా?" నిరీక్షణ అడిగింది.

"ప్రస్తుతం ఉద్యోగం లేక నావెంట పడుతున్నాడు."

"అంటే?"

"అన్నయ్య చేయలేని పని నేను చేస్తాను. ఎంతకాలం ఒంటరిగా ఉంటావు. అంటాడు."

"ఛీ! నీకు మరీ సిగ్గు లేదే." సరదాగా అంది అపర్ణ.

"మామగారు కూడా అలాగే అంటారు. నేను సిగ్గులేని దాన్నని. నీతిలేని దాన్నని. నన్ను వెంటాడేది మా మరిది. వేటాడేది మామగారు. ఏమైనా అంటే పుట్టింటికి పో! మా అబ్బాయికి వేరే పెళ్ళి చేస్తాం అన్న మాటలు, తప్పనిసరిగా ప్రొద్దున్నే సుప్రభాతంతో వినిపిస్తాయి." విషాదంగా నవ్వింది.

"నేనైతే అలాంటి ఇంట్లో ఉండను సుమా?" రమ్య అంది.

"నేనూ ఉండను. నీవే కాదు" స్మిత అంది.

"మీ అన్నయ్య దగ్గరకు వెళ్ళిపోతావా?"

"లక్ష్మణరేఖ గీశాడు. దాటి లోపలికి ఎలా వెళ్ళను?" స్మిత.

"దాటెయ్యి. చిన్నప్పుడు హైజంప్, లాంగ్ జంప్‌లు చేసేదానివిగా!" నిరీక్షణ అంది.

"ఆ జంప్‌లన్నీ ఇప్పుడు పనికి రావడం లేదు."

"ఏం? పని మానేశావా? బట్టలు కూడా ఉతకడం లేదా?" చారుమతి అంది.

"ఓహూ! పెళ్ళి కూతురు కూడా మాట్లాడుతూందే! వికారం తగ్గిందా?" వెక్కిరించింది స్మిత.

ఇంతలో 'చల్లని రాజా, ఓ చందమామా అని పాడుకుంటూ అడుక్కునేవాడు వచ్చాడు. "ఈ అడుక్కునే వాళ్లంటే నాకు చిరాకు బాబూ! వీళ్ళని..." అంటూ ఆగిపోయింది రమ్య.

"భిక్షం వేసి పంపించెయ్యాలి" అని మాట పూర్తిచేస్తూ పర్స్ తీసి పది రూపాయలు వేసేసింది స్మిత.

"ఏయ్, ఏమిటా పని అదెంతో తెలుసా?"

"తెలుసు. పది రూపాయలు. అల్లుడి హోదాలో అడుక్కుని భార్యను బాధించే వాళ్ళకంటే వీళ్ళేం తక్కువవాళ్ళు కాదు. రెండుపూటలా కడుపునిండా తిననియ్!"

బిక్షగాడు మాత్రం ముందు బిత్తరపోయినా తరువాత ఆ నోటు కళ్ళ కద్దుకొని గబగబా అక్కడినుండి వెళ్ళిపోయాడు. స్మిత ఆ నోటు లాక్కుంటుంది అని కాదు, ఆమె ఫ్రెండ్స్ లాక్కుంటారనే భయంతో.

"మరలా స్టేషన్ వస్తే బాగుండును!" స్మిత అంది.

"ఎందుకూ?" ప్రశ్నించింది చారుమతి.

"మీ ఆయనకు కూల్‌డ్రింక్స్ బిల్ అప్పజెప్పడానికి!" స్మిత మాటలకు చారుమతి నవ్వింది.

ఉన్నట్టుండి "మనుషులు ఒంటరిగా వెళ్ళేది ఎక్కడికి?" అడిగింది స్మిత.

"పైకి" వేలు పైకి పెట్టి చూపించింది రమ్య.

"కాదు. ఇంకో చోటు కూడా ఉంది" అంటూ చటుక్కున లేచి నిలబడింది స్మిత.

"ఏయ్! ఎక్కడికి?" కంగారుగా అడిగింది నిరీక్షణ.

"ఇదిగో ఇక్కడికి" అంటూ నాలుగు వేళ్ళు మూసి చిటికెన వ్రేలు చూపించింది.

"ఏయ్, నీకు కొంటెతనం పోలేదు."

"వెడతా, ఒంటరిగా వెళ్ళే చోటుకి" అంటూ టాయిలెట్‌వైపు వెళ్ళింది స్మిత.

స్మిత కొంటెతనం చూసి అందరూ నవ్వుకున్నారు.

"వాళ్ళ అత్తగారు, భర్త మంచివారేనట. స్మిత ఎందుకు అలా మాట్లాడుతుంది?"

"ఆ! దాని సంగతి కొత్తగా అడుగుతావెందుకు? ఏదైనా పుస్తకంలో చదివిన కథలు మనకు చెప్పడం మొదటినుంచీ అలవాటేగా!" అపర్ణ అంది.

"నిజమేనంటావా?"

"నిజం కాకపోతే అది చెప్పిన కథలన్నీ నమ్మేసి కడివెడు నీళ్ళు కార్చు."

ఇంతలో స్మిత వచ్చింది. ట్రెయిన్ ఎందుకో ఆగిపోయింది.

"మనం బయలుదేరిన తరువాత ఈ ట్రెయిన్ ఇలా ఆగిపోవడం అప్పుడే నాలుగవసారి. ఇలాగే ఈ బండి నడిచిందంటే చారుమతికి డెలివరీ కూడా ఇందులోనే అయిపోతుంది - మనం విశాఖ వెళ్ళేలోపుగా."

అందరూ నవ్వారు. చారుమతి సిగ్గుపడింది.

బండి ఆగడం తరువాయి కాఫీలు, కూల్‌డ్రింక్స్ వచ్చేశాయి. అందరూ అన్ని కూల్‌డ్రింక్స్ తాగారు. "ఇంకా కావాలాండి" అడిగాడు డ్రింక్స్ అబ్బాయి.

"ఇంకే మొద్దని చెప్పవే. బిల్లు కూడా!" స్మిత మెల్లగా అంది అపర్ణతో.

"మొత్తం అయిదు" అని లెక్కలు కడుతున్నాడు డ్రింక్స్ అబ్బాయి.

"అదిగో అక్కడ కనబడుతున్నారు చూడు. ఆయనకు ఇవ్వు" స్మిత అంది రాజేష్‌ని చూపిస్తూ.

"గోల్డ్‌స్పాటా, మజాకానా!" అన్నాడా అబ్బాయి.

"రెండూ కాదు. బిల్లు!" ఆ మాటలకు ఆ అబ్బాయి బిత్తరపోయినా మిగిలిన వారు గొల్లున నవ్వారు.

"నీవు ఊరుకోవే, స్మితా!" అంటూ చారుమతి పర్స్ తీయబోయింది.

"అబ్బో! అప్పుడే ఆయనగారు అంటే ఎంత ప్రేమ! ఏమీ అననివ్వడం లేదు."

వారు తాగిన కూల్‌డ్రింక్స్‌లో ఏ రకం హుషారు ఉందోగాని ఈ సారి వారు మరింత విజృంభించారు అల్లరితో.

చారుమతి ఇంకా మెల్లగా తాగుతూనే ఉంది.

"అబ్బ. ఎంతసేపే, బాబూ! త్వరగా తాగు. వేడిగా ఉందా! నీవు కొత్త పెళ్ళి కూతురివని దానికి తెలియదులే. మెల్లగా తాగనక్కరలేదు." స్మిత అంది.

"సీసాను కాదు, నోట్లో పట్టనుగాని పడితే నన్నే మింగేయాలని ఉంది. దానికి వాళ్ళాయనకు బిల్లు అప్పజెప్పానని."

అందరితోపాటు చారుమతీ నవ్వింది.

వాళ్ళ మాటలు ట్రయిన్‌లోని వారికి డిస్ట్రబెన్స్ అయినాసరే మాదారి మాదేసుమా అన్నట్లు వాళ్ళు మాట్లాడుకుంటూనే ఉన్నారు. ఒకరిమీద ఒకరు జోక్స్ వేసుకొని నవ్వుకుంటూనే ఉన్నారు.

ట్రయిన్ ఎందుకో ఆగిపోయింది. అప్పుడే చీకట్లు కమ్ముకొంటున్నాయి.

"అబ్బ! ఈ ట్రయిన్ ఇలా ఆగిపోవడం అప్పుడే అయిదోసారి." రమ్య అంది.

"ఈ ట్రయిన్ ఇలాగే ఆగుతూ వెళ్ళిందంటే చారుమతి కొడుక్కి అన్నప్రాశన రైల్వే భోజనంతో రైల్లోనే చెయ్యాల్సి ఉంటుంది చారుమతిని చూస్తూ వెక్కిరిస్తూ అంది స్మిత.

మరోసారి అందరూ నవ్వారు ఆనందంగా. పచ్చని కలశంలో మేలిమి ముత్యాలు వేసినట్లు వారి తీరు చూస్తుంటే గాలినే ఆనందంగా మలుచుకొని పీలుస్తున్నట్లుంది వారు.

"నాకు కథలు వ్రాయాలని ఉంది. మంచి కథ చెప్పవే!" రమ్య అడిగింది స్మితను.

"ఇప్పుడు చెప్పిన కథ వ్రాసెయ్యి!" స్మిత అంది.

"అందులో బలం లేదు."

"అయితే అపర్ణ వాళ్ళ ఆయన్ని అడుగు డాక్టరు కదా, ఒక టానిక్ ఇస్తారు!"

"సరేలే! ఎనాల్జిన్ ఎందుకు పనికొస్తుంది అని ఎన్నిసార్లు అడిగినా మాట్లాడరు. ఇంటినిండా మందులుంటాయిగాని ఏది ఎందుకు పనికి వస్తుందో తెలియదు. ఒకసారి కడుపులో కుడిపక్క నొప్పి వచ్చి అపెండిసైటిస్ అని భయపడి - అపెండిసైటిస్‌కి నొప్పి ఎక్కడ వస్తుంది? ఎలా వస్తుంది. ఆపరేషన్ ఎక్కడ చేస్తారు? అని అడిగాను."

"ఏమన్నారు మీ ఆయన?" నిరీక్షణ ప్రశ్నించింది.

సమాధానం స్మిత చెప్పింది. "ఏమీ చెప్పి ఉండరు. అవన్నీ చెప్పేస్తే 'మీరు అయిదు సంవత్సరాలు చదివి డాక్టరయ్యారు. కాని మిమ్మల్ని పెళ్ళాడి డాక్టరయ్యాను. అపెండిసైటిస్ ఆపరేషన్ చేయడం నాకూ వచ్చేసింది. చేసేస్తాను!' అని అంటుందని పాపం ఆయన భయపడి ఉంటారు." అందరూ నవ్వారు మరోసారి.

"అబ్బ, పొట్ట చెక్కలవుతోందే!" రమ్య అంది.

"ఫరవాలేదు. మీరు ఇల్లు కట్టించుకుంటున్నారుగా! తలుపులు చేయించుకోండి!" అంటూ స్మిత తిరిగి అంది - "నేనొక కథ వ్రాశాను." అంది.

"ఏయ్ నిజంగా! మరి మెల్లగా చెపుతావేం. పడిందా ఎందులోనైనా?" రమ్య అంది.

"ఆ పడ్డాయి - వీక్లీలో ఓ కథ, నా వీపు మీద వాత?"

"వాతా? ఎందుకు?"

"కథలో హీరోయిన్‌కి అనుకోకుండా పెళ్ళికి ముందు ఒక కూతురు పుడుతుంది. ఆ కథను నాకు అన్వయించి నీకూ పెళ్ళికి ముందు ఒక కూతురుందా అని మామగారు నన్ను అనరాని మాటలన్నారు."

"ఉంది. నాతోనే బియ్యే చదివేది అని చెప్పలేకపోయావా!"

"అసలు కథలు - ఎవరికి వారే రాసుకుంటే ఒక్కొక్క మనిషికి ఒక్కొక్క కథే వస్తుంది. ఇన్ని కథలు ఎక్కడినుండి వస్తాయి. రచయిత(త్రి) సంఘంలోని సమస్యలను తీసుకొని, వాటిని వ్రాసి పరిష్కారం కూడా చూపించాలి. అందుకే 'రవి కాంచని చోటు కవి కాంచున్' అన్నారు. అంతేగాని ఎవరో ఏదో అన్నారని భయపడుతూ కూర్చుంటే అసలు ఎవరూ ఏమీ వ్రాయలేరు. అయినా రామాయణం వ్రాసిన వాల్మీకిని 'నీవు రామాయణంలో రాముడివా? రావణుడివా?' అని అడిగితే ఎంత హాస్యాస్పదంగా ఉంటుందో అలాగే ఉంది నీ గొడవ." నిరీక్షణ అడిగింది.

"ఏమో! బహుశా తప్పు నాదేనేమో! నేనే తప్పుగా వ్రాశానేమో!" అవతలి వారిని ఏమీ అనలేక తప్పు తనమీదే వేసుకుంది.

"అవును. తప్పు నీదే! నిన్ను ఏం చేసినా పాపం లేదు. నిన్ను నరికినా తప్పులేదు. లేకపోతే నాకు చెప్పకుండా కథలు వ్రాస్తావా? బంగారుతల్లీ, కథలు ఎలా వ్రాయాలో నేర్పించవూ?" రమ్య అడిగింది లాలనగా స్మితను.

స్మిత "కథలు వ్రాయడం ఒకరు నేర్పిస్తే వచ్చేది కాదు! ఏ కళనైనా - చిత్రకళ, శిల్పకళ, సంగీతం ఏదైనా ఒకరి దగ్గర నుండి ఒకరు నేర్చుకోవచ్చు. కాని, రచనలు చేయడం అలా కాదే. అదొక వరం. కాగితం, కలం చేయి ఉంటే సరిపోవు. ఆలోచించే మెదడు, అవి కాగితంమీద పెట్టగలిగే శక్తి ఉండాలి. అయినా నీవూ వ్రాయగలవులే! ఉత్తరం వ్రాయడం వచ్చిన వారికి కథలు వ్రాయడం వస్తుందట!" అంది.

"అయితే నాకు మెదడు లేదంటావా?" రమ్య అంది.

"ఏమో? నాకేం తెలుసు బ్రెయిన్ స్కానింగ్ చేయించుకొని న్యూరోసర్జన్ని అడుగు." స్మిత అంది నవ్వుతూ.

అపర్ణ కునికిపాట్లు పడసాగింది.

"దుర్మార్గురాలా! మేమందరం మాట్లాడుకుంటుంటే నీకు మత్తెలా వస్తుందే?"

ఉలిక్కిపడి లేచి నవ్వేసింది అపర్ణ. బాత్‌రూమ్‌కి వెళ్ళి నీళ్ళతో మొహం కడుక్కొని వచ్చింది. అపర్ణ వచ్చిన తరువాత టాయిలెట్‌కి చారుమతి వెళ్ళింది. నిజానికి టాయిలెట్‌కి కాదు. వాళ్ళాయన ఏం చేస్తున్నాడో చూడడానికి. అప్పటికే అందరితోపాటు రాజేష్ కూడా నిద్రపోయాడు. వీళ్ళు మాత్రం పడుకోకుండా కూర్చుని అలాగే కబుర్లు చెప్పుకుంటున్నారు.

"ఏయ్ చారూ! ట్రయిన్‌లో మనుషుల్నే గాని, పిల్లుల్ని ఎక్కనివ్వరు." స్మిత అంది.

"ఇప్పుడు నీకు పిల్లులు ఎందుకు గుర్తుకు వచ్చాయి?"

"అబ్బే! మీ ఆయన్ని పిల్లెత్తుకుపోయిందేమోనని చూసి వచ్చావుగా!"

అందంగా సిగ్గుపడింది చారుమతి. "మీ ఆయన పేరు నచ్చలేదోయ్! రాజేష్ ఏమిటి బాటా షూలాగా!" మరలా ఏడిపించింది స్మిత, చారుమతిని.

"మరి మమ్మల్ని ఇన్ని ఆటలు పట్టిస్తున్నావు! మరి మీ ఆయన్ని ఎన్ని ముప్పుతిప్పలు పెడుతున్నావో?" రమ్య అంది.

"ముప్పుతిప్పలు పెట్టడం లేదు. పడుతున్నాను." స్మిత అంది నవ్వుతూ.

"అసలు ఆడది మగవాడికి ఎందుకు లొంగి ఉండాలి?" నిరీక్షణ అంది.

"ఆడది కాబట్టి!" స్మిత అంది.

"అసలు అందరూ మగవాళ్ళని ఆడిపోసుకుంటారుగాని, భార్యల వల్ల నరకం చూసే భర్తలు లేరా? వారి మీద ఏదైనా వ్యాసం వ్రాయాలనుకుంటున్నాను." రమ్య అంది.

"వారిమీద వద్దులే! కాగితం మీద వ్రాయి. అయినా నీకిదేం బుద్ధి? అసలే ఆంధ్రుల బ్రతుకు అంతంత మాత్రంగా ఉంది. నీవు కలంతో వారిని మర్డర్ చేయకు."

"మీకు వంట మనిషి ఉందా?" అపర్ణ అడిగింది స్మితను.

"ఆల్-ఇన్-వన్‌ని నేనుండగా ఇంకెందుకు వంటమనిషి. వాళ్ళు పెట్టిన తిండి తినడం, ఇచ్చిన బట్ట కట్టడం, మెలకువగా ఉన్నంతసేపూ చాకిరీ చెయ్యడం. మాఅన్నయ్య ఆస్తి పట్టుకుపోయానని నా విషయం కల్పించుకోడు. నన్ను పట్టు పరుపులమీద పడుకోబెడుతున్నారనుకుంటాడు. అది అంపశయ్య అని తెలియదు. అది సరేగాని, ఇంక వైజాగ్ వస్తే ఎవరిదారి వారిదే. మనం అందరం ఎప్పుడూ ఆడుకునే

ఆట ఆడదాం" అంటూ గబగబా హేండ్‌బాగ్‌లో నుండి కాగితాలు, పెన్ను తీసి రహస్యంగా వ్రాయడం మొదలుపెట్టింది స్మిత.

"మరలా ఆటలు మొదలుపెట్టావా?" ఆవలిస్తూ అంది అపర్ణ.

"వెధవ మొద్దు నిద్రా, నీవూనూ! అప్పటికీ ఇప్పటికీ నీకు ఆ నిద్ర పోవడం లేదు. మీ ఆయన నీతో ఎలా వేగుతున్నాడో. అలాగే నిద్రపో! నీ కసలు పిల్లలే పుట్టరు." స్మిత విసుక్కుంది.

గబగబా చీటీలమీద వ్రాసినవి ఎవరివి వారికి ఇచ్చింది.

"ఎవరూ విప్పి అప్పుడే చూడవద్దు సుమా?" అని అంది. అది వారికి సుగ్రీవాజ్ఞ.

"నా దాంట్లో ఏం వ్రాశావో. బాబోయ్, రైల్లోనుండి దూకమంటే నేను దూకలేను. అసలే మావారికి నేనంటే పంచప్రాణాలు." నిరీక్షణ అంది.

"పోనీలే నీ బదులు నేను చేస్తాను ఆ పని." స్మిత అనగానే - "ఒకరి బదులు ఒకరు చేసేది లేదు. ఇదివరకు అలాగే చెట్టుమీద నుండి దూకమని చీటీలో ఉండే నిరీక్షణకు నీవు సాయం చేశావు. అసలే నిరీక్షణ అంటే ఎక్కువ ఇష్టం!" రమ్య అంది.

"సరే! ఈసారి ఎవరికీ సహాయం చేయను. చీటీలో పాడమని ఉంటే పాడాలి. సిగరెట్ తాగమని ఉంటే తాగాలి!"

"బాబోయ్, ట్రయిన్‌లోనా?" అపర్ణ భయంగా అంది. "ట్రయిన్ కాబట్టే సరదాగా ఆడదాం. మరలా ఇలాంటి అవకాశం మనకు రాదు. ఈ ఒక్కసారికి మనం ట్రయిన్‌లో ఎవరు ఏమనుకున్నా లెక్క చెయ్యవద్దు. మనం ఆర్ట్స్ స్టూడెంట్స్ కదా, లెక్కలు ఎలాగూ రావనుకో మనకు!" అంటూ లేచింది.

"నేను బాత్‌రూమ్‌నుండి వచ్చేవరకూ అవి విప్పని వాళ్ళకి ఒక మంచి ప్రజెంటేషన్ ఇస్తాను." స్మిత అంది.

"అందరం విప్పకపోతే అందరికీ ప్రజంటేషన్ పంచబడుతుంది" రమ్య అంది.

"బాత్‌రూమ్‌లో ఎంత సేపు ఉంటావు?"

"నాకు వంద సంవత్సరాలు వచ్చేవరకూ!"

"అయ్యబాబోయ్" అంటూ అందరూ నవ్వారు.

ట్రయిన్ సామర్లకోట దాటింది. అందరూ మంచి నిద్రలో ఉన్నారు. స్మిత టాయిలెట్‌కి వెళ్ళడానికి లేచింది.

"విష్‌యూబెస్ట్‌ఆఫ్ లక్!" నిరీక్షణ అంది స్మితను ఏడిపిస్తూ.

"థాంక్యూ!" నిరీక్షణ బుగ్గని ముద్దు పెట్టుకుంది.

"మరి నాకో? నాకో?" అంటూ అందరూ ఆమె వెనుక పడ్డారు. అందరికీ తలో ముద్దు పెట్టింది. ఆ ట్రయిన్‌లో అందరూ నిద్రపోతున్నా, వీరు అయిదుగురు అల్లరిమాత్రం మానలేదు. ఎటొచ్చీ వారు కూర్చున్న సీట్ల దగ్గర పరాయివాళ్ళు లేకపోవడంతో అల్లరికి ఏమీ ఆటంకం కలగలేదు.

స్మిత టాయిలెట్‌కి వెడుతుంటే "నేనూ రానా?" అపర్ణ అంది.

"ఛీ! వెధవబుద్ధి! అక్కడికి కూడా ఒంటరిగా వెళ్ళనివ్వరు!" నవ్వుతూ విసుక్కుంది.

"సర్లే, తల్లీ! ఒంటరిగానే పని పూర్తి చేసుకొని రా! సస్పెన్స్ భరించలేకపోతున్నాం!"

స్మిత చిరునవ్వు నవ్వుతూ వెళ్ళింది. ట్రయిన్ మంచి స్పీడుగా నడుస్తూంది.

ఆ చీటీల్లో ఏముందోనని అందరికీ ఆత్రుతగా ఉంది. విప్పి చూడాలని ప్రయత్నించారు. కాని నిరీక్షణ ఊరుకోలేదు - వద్దు స్మితతో చెబుతానని బెదిరించింది. అందరూ స్మిత గురించి మాట్లాడుకుంటూంటే ఎవరో చెయిన్ లాగినట్టున్నారు. ట్రయిన్ ఆగింది.

ఏమిటా అని అందరూ బయటకు చూశారు. బయట అంతా చీకటి. స్మిత ఇంకా ఏం చేస్తోంది? అని టాయిలెట్‌కి అపర్ణ వెళ్ళింది. టాయిలెట్స్ రెండూ ఖాళీ. ఒక్కసారి కెవ్వున అరిచింది అపర్ణ.

"ఇందాక అమ్మాయి ట్రయిన్‌లోనుండి దూకింది. నేనే చెయిన్ లాగాను." ఎవరో అన్నారు. ఆ ట్రయిన్ అంతా గందరగోళం అయిపోయింది. అందరికీ వెన్నులోనుండి వణుకు వచ్చింది.

"స్మితా! నీవు చెప్పిన కథ నిజమేనా?" అందరూ గొల్లుమన్నారు.

చేతిలో చీటీలు తడిసిపోయి నలిగిపోయాయి. దుఃఖంలో విప్పి చూశారు. నిరీక్షణ విప్పింది - "ఆడపిల్లకు ఆస్తి హక్కు వద్దు. దాని వలన పుట్టింటికి దూరం కావడం తప్ప ఉపయోగం లేదు."

అపర్ణ చీటీలో - "నేను చెప్పింది అబద్ధం కాదు. అంతా పచ్చి నిజం. ఒక్క అక్షరం కూడా తప్పు లేదు. నాకు దినదినగండంలాంటి ఈ బ్రతుకు వద్దు. వారి చేతిలో చచ్చేకంటే మీ అందరి ముందూ ఇదే హాయి కదూ!"

రమ్య చేతిలో - "నాకు ముసలితనం రాదు. మీరందరూ ముసలివాళ్ళయినా మీదృష్టిలో నేనెప్పుడూ పడుచు స్మితనే కదూ!"

చారుమతి చీటీలో - "విష్ యూ హేపీ మారీడ్ లైఫ్! మీలో ఎవరికి ముందు ఆడపిల్ల పుట్టినా ఆమెకు నా పేరు పెట్టండి. బారసాలలకు పెళ్ళిళ్ళకు కల్సినట్టే అందరూ

కలవండి. అప్పుడు నలుగురు నవ్వే వేళ నా పేరూ తలవడం మానకండేం."

గుడ్ బై.

అంతవరకూ నవ్వులు వినబడిన ఈ సీట్లలో ఇప్పుడు ఏడుపులు ప్రారంభమయ్యాయి. ఈసారి అయిదుగురు కాదు - నలుగురు మాత్రమే ఆ నిశీధిలో స్టేషను కాకపోయినా నిశ్శబ్దంగా నిలబడిపోయింది. స్మిత చావుకు సంతాపసూచకంగా కోణార్క్.

(ప్రభ, 12-11-86)

☆ ☆ ☆